క్లుప్తంగా

పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా రమేష్


నాగబండి రమేష్


గుగులోత్ కిషన్

కాశోజి సెంటర్ : పీఆర్‌టీయూ రాష్ట్ర కమిటీ అసోసియేట్ అధ్యక్షుడిగా రాయపర్తి మండలం కేశవపూర్ జెడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయుడు నాగబండి రమేష్, వరంగల్ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా దుగ్గొండి మండలం మల్లంపల్లి జెడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయుడు గుగులోత్ కిషన్ ఎన్నికైనట్లు పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ పార్వతి సత్యనారాయణ ప్రకటించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన రమేష్, కిషన్‌లు మాట్లాడుతూ తమపై నమ్మకంతో ఈ పదవిలో ఎన్నుకున్నందుకు సంఘం బలోపేతం కోసం కృషి చేస్తూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పోరాడుతామని తెలిపారు.

'మహావిష్ణువు'గా శివయ్య

కాజీపేట: స్థానిక శ్రీభ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవాలయంలో మంగళవారం మహాశివుడిని మహావిష్ణువు అవతారంలో అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు అయిన వోలు ప్రవీణ్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో శివుడిని విష్ణురూపంలో అలంకరించగా భక్తులు దర్శనం చేసుకున్నారు. ఆలయ పాలకమండలి సభ్యులతో పాటు శివ–శక్తి యూత్ అసోసియేషన్ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు.

టెండర్ల ఆహ్వానం

వరంగల్: హనుమకొండలోని బాలికల పారిశ్రామిక శిక్షణ సంస్థలోని ఐటీఐ స్మార్ట్ అగ్రికల్చర్ టెక్నీషియన్, డ్రోన్ టెక్నీషియన్ కోర్సుల్లో వివిధ వస్తువులు టూల్స్, ఎక్విప్‌మెంట్, మిషనరీ కొనుగోలు చేసేందుకు ఆన్‌లైన్ వెబ్‌సైట్ http://tender.telangana.gov.in ద్వారా టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు ఐటీఐ(బాలికలు) వరంగల్ ప్రిన్సిపాల్ జి.సక్కు ఒక ప్రకటనలో తెలిపారు. టెండర్ల స్వీకరణకు చివరి తేది ఈనెల 29 ఉదయం 11 గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

సుందరకాండ పారాయణం

మడికొండ : శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా మడికొండలోని మెట్టురామలింగేశ్వరస్వామి ఆలయంపై సుందరకాండ గోష్ఠి, సుందరకాండ పారాయణం నిర్వహించారు. కార్యక్రమంలో గుండవరము హరిప్రియ, భారతి, సుజాత, గిరిజ, విజయలక్ష్మి, రజిత, అరుణ, శ్యామల, యాదమ్మ, స్వరూప, కమలమ్మ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డివిజన్లలో గ్యాంగ్ వర్క్

హసన్‌పర్తి : నగరంలోని 1, 55, 66వ డివిజన్లలో నాలుగు రోజుల పాటు గ్యాంగ్‌వర్క్ చేపట్టారు. ఈ సందర్భంగా మురికి కాల్వలు శుభ్రం చేశారు. ఆయా డివిజన్లలోని కాలనీల్లో పేరుకపోయిన చెత్తను తొలగించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాషానాయక్ ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో జవాన్లు, పారిశుద్ధ్య, కార్మికులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 3కే రన్

వరంగల్ స్పోర్ట్స్ : అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మూడో రోజు మంగళవారం 3కే రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. హనుమకొండలోని జేఎన్‌ఎస్ వద్ద ప్రారంభమైన 3కే రన్‌ను బీసీ వెల్ఫేర్ అధికారి రాంరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ప్రారంభించారు. ప్రతి రోజు నడక, వ్యాయామం అలవర్చుకోవాలని సూచించారు. రన్నింగ్‌లో పాల్గొన్న ఆపద మిత్ర వలంటీర్లు, యువకులు పాల్గొనగా విజేతలకు బహుమతులు అందజేశారు. అగ్నిమాపక శాఖ అధికారులు భగవాన్‌రెడ్డి, జయపాల్ రెడ్డి, సుధాకర్‌రెడ్డి, నాగరాజు, రాజేందర్, లక్ష్మణ్, రవీందర్, యాకయ్య పాల్గొన్నారు.

ఉద్యమకారుల పెన్షన్ అమలు చేయాలి

నయీంనగర్: 1969 ఉద్యమకారుల పెన్షన్ అమలు చేయాలని తెలంగాణ మూవ్‌మెంట్ డిటిన్యూస్ ఫోరం (1969) వరంగల్ జిల్లా కమిటీ కోరింది. మంగళవారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఫోరం కోశాధికారి రాయిడి గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ తమ సంఘం తెలంగాణ ఏర్పడక ముందు 2013లోనే రిజిస్ట్రేషన్ అయిందని అయినా గత ప్రభుత్వంలో తమకు ఎలాంటి ఊరట లభించలేదన్నారు. 82 మంది తెలంగాణ ఉద్యమకారులకు పెన్షన్, ఇతర రాయితీలు ఇవ్వాలని హైకోర్టు తీర్పు ఇచ్చిందని దానిని వెంటనే అమలుచేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో నర్సింహారెడ్డి, సత్తయ్య, సంజీవరెడ్డి, దుర్గారావు, నర్సింగం, వెంకట్‌రెడ్డి, కేదారి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

మడికొండ: రాష్ట్ర స్టేట్ ఆయిల్ సీడ్స్, గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి సమక్షంలో మడికొండకు చెందిన పీఏసీఎస్ దర్గా సొసైటీ డైరెక్టర్, బీఆర్‌ఎస్ పార్టీ 64వ డివిజన్ అధ్యక్షుడు దువ్వ శ్రీకాంత్, కాంగ్రెస్ నుంచి బీజేపీ పార్టీలో చేరిన బైరి కొంరయ్యగౌడ్ తిరిగి కాంగ్రెస్‌లో చేరారు. వారివెంట కాంగ్రెస్ కాజీపేట మండల అధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, దువ్వ విజయ్, జగదీశ్వర్‌రెడ్డి, బైరి లింగమూర్తి, విజయ్ ఉన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

● వరంగల్ జిల్లా స్వీప్ నోడల్ అధికారి భాగ్యలక్ష్మి

వరంగల్ అర్బన్ : భవిష్యత్‌ను నిర్ణయించేది ఓటు మాత్రమే అని వరంగల్ జిల్లా స్వీప్ నోడల్ అధికారి పెద్దిరెడ్డి భాగ్యలక్ష్మి అభిప్రాయపడ్డారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో వరంగల్ బల్దియా ప్రధాన కార్యాలయంలోని మెప్మా భవన్‌లో మంగళవారం స్వీప్ –2024 అవగాహన సదస్సు నిర్వహించారు. ఆశయం పట్టణ సమాఖ్య సభ్యులకు ఓటు హక్కు ప్రాధాన్యంపై టీపీఆర్వో కోలా రాజేశ్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సదస్సులో నోడల్ అధికారి మాట్లాడారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు కీలక భూమిక పోషిస్తుందని, ప్రధానంగా యువత ఓటు హక్కును సద్వినియోగం చేసుకొని సమర్థవంతమైన నాయకుడిని ఎన్నుకోవాలని కోరారు. అనంతరం సమాఖ్య సభ్యులతో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. సదస్సులో టీఎంసీ రమేశ్, సీఓలు


వరంగల్ అర్బన్ : ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేయిస్తున్న నోడల్ అధికారి భాగ్యలక్ష్మి

నాగరాజు, శ్రీలత, రజిత, రమ, ప్రవీణ్, సఫియా, రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

హన్మకొండ: పట్టణ ప్రాంత ప్రజలు, విద్యాధికులై ఉండి కూడా ఓటు వేయడానికి నిరాసక్తత చూపుతున్నారని, ఈ ధోరణి మారాలని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత అంపశయ్య నవీన్ అన్నారు. ఓటు హక్కే కాదు మన బాధ్యత కూడా అని ప్రతి ఒక్కరు తప్పక ఓటు వేసి ప్రజాస్వామ్య విలువలను గౌరవించాలని హితవుపలికారు. ఓటర్ అవగాహన కార్యక్రమంలో భాగంగా మంగళవారం హనుమకొండ ఎక్సైజ్ కాలనీలోని స్వగృహంలో రికార్డ్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు కుసుమ సురేష్‌తో పాటు నిమ్మల శ్రీనివాస్ అంపశయ్య నవీన్‌ను కలిశారు. కార్యక్రమంలో మహమ్మద్ సిరాజుద్దీన్, రామ్మోహన్, శశికిరణ్ పాల్గొన్నారు.

కేయూలో ఓటరు చైతన్య కార్యక్రమం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ మైదానంలో మంగళవారం ఉదయం కేయూ వాకర్స్ సంఘాల బాధ్యులు స్వీప్ ఆధ్వర్యంలో ఓటరు చైతన్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించకొని దేశ భవిష్యత్ కోసం మంచి అభ్యర్థులను ఎన్నుకోవాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి స్వీప్ నోడల్ అధికారి లక్ష్మి రమాకాంత్, రవిబాబు, నారాయణ, స్వీప్ ఆఫీస్ బేరర్స్ సోమేష్, రాజు, విక్రమ్, పాల్గొన్నారు.

మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యం

● బీజేపీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేశ్

మడికొండ: ప్రధాని నరేంద్ర మోదీతోనే దేశం అభివృద్ధి సాధ్యం అని వరంగల్ బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్ అన్నారు. మంగళవారం బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు బీజేపీలో చేరికల సందర్భంగా మడికొండలోని పీఎస్‌ఆర్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మతో కలిసి పాల్గొన్నారు. 46వ డివిజన్ బీఆర్‌ఎస్‌కు చెందిన కార్పొరేటర్ మునిగాల సరోజన ఆధ్వర్యంలో బీజేపీలోకి 50 మంది చేరారు. వారికి పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో కార్పొరేటర్ మునిగాల సరోజన, కరుణాకర్, పిట్టల రమేష్, మడికొండ గౌడ సంఘం మాజీ అధ్యక్షుడు బుర్ర రాజన్‌బాబు, రాజ్‌కుమార్, రాజేష్, రమేష్, రాజేందర్, కుమార్, రాజు, తదితరులు ఉన్నారు.

బీజేపీలో చేరికలు

హన్మకొండ: బీఆర్‌ఎస్‌కు చెందిన మహిళా నాయకులు పలువురు బీజేపీలో చేరారు. మంగళవారం కాజీపేట ప్రశాంత్‌నగర్‌లోని ఎంపీ అభ్యర్థి అరూరి రమేశ్ స్వగృహంలో జరిగిన కార్యక్రమంలో హనుమకొండ ఆరెపల్లికి చెందిన మహిళా నాయకులు వెల్దండి స్వరూప, మారగోని శిరీష, పొగాకు శ్రీలత, బొమ్మ సమ్మక్క, తాటికొండ రాజమణి, పొగాకు ప్రమీలతో పాటు పలువురు బీజేపీలో చేరగా అరూరి కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపుకు కృషి చేయాలన్నారు.


హన్మకొండ: కండువా కప్పి బీజేపీలో చేర్చుకుంటున్న అరూరి రమేశ్

క్రీడాకారులకు అండగా ఉంటాం : దాస్యం

హన్మకొండ: అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ ప్లేయర్స్‌కు అండగా ఉంటామని మాజీ చీఫ్ విప్, బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ క్రీడాకారులకు రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్‌లో వసతి కల్పించాలని డిమాండ్ చేశారు. అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ ప్లేయర్స్‌కు రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్‌లో ఇప్పటి వరకు కల్పించినట్లుగానే భోజన, నివాస, శిక్షణ ఇతర వసతులు కల్పించాలన్నారు. ఒకవేళ అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ ప్లేయర్స్‌కు కల్పిస్తున్న వసతిని ఎత్తివేసినా, స్పోర్ట్స్ హాస్టల్‌ను తరలించినా క్రీడాకారులతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. తరలించే ఆలోచన ఉంటే విరమించుకోవాలని సూచించారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ, యువజన, క్రీడల విభాగం అధి కారులు స్పందించి అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ క్రీడాకారులకు న్యాయం చేయాలని కోరారు. క్రీడాకారులకు కావల్సిన కనీస సౌకర్యాల కల్పనకు కృషి చేయాలని వినయ్ భాస్కర్ కోరారు.

డీఆర్‌ఎంను కలిసిన ఎమ్మెల్యే 'నాయిని'

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే దీర్ఘకాలిక పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి బుధవారం సికింద్రాబాద్ రైల్వే డివిజనల్ మేనేజర్ (డీఆర్‌ఎం) భర్తీశ్‌కుమార్ జైన్‌ను కలిశారు. అన్ని అర్హతలున్న అతి ముఖ్యమైన కాజీపేట జంక్షన్‌ను డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేయాలని, వ్యాగన్ షెడ్ నిర్మాణ పనుల్ని త్వరతగతిన పూర్తి చేయాలని, కోచ్ ఫ్యాక్టరీ మంజూరు చేయాలని, కాజీపేట–సికింద్రాబాద్ మూడో రైల్వే లైన్ నిర్మాణం చేపట్టాలని, కాజీపేట నుంచి వివిధ ప్రాంతాలకు కొత్త రైళ్లను ప్రారంభించాలని, కాజీపేటలో ఐటీఐ అంప్రెంటీస్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, కాజీపేట జంక్షన్ బస్టాండ్ అభివృద్ధి, రైల్వే కాలనీల్లో తాగునీటి కోసం పైప్‌లైన్ నిర్మాణం, రైల్వే స్టేషన్ పరిధిలో చిరువ్యాపారుల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే డీఆర్‌ఎంకు వినతి పత్రం ఇచ్చారు. సానుకూలంగా స్పందించిన డీఆర్‌ఎం ప్రజల డిమాండ్లు తీర్చేలా కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాస్‌రావు, టీపీసీసీ కార్యదర్శి ఈవీ శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.


డీఆర్‌ఎంకు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

రామన్నపేట : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ బైరి ప్రభాకర్ అన్నారు. పాలిటెక్నిక్ కళాశాల వార్షిక క్రీడా దినోత్సవం–2024ను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పరకాల, కోరుట్ల, కాటారం ప్రిన్సిపాళ్లు బి.శ్రీనివాస్, ఎం.రాంప్రసాద్, బి.గోవర్ధన్ హాజరై జ్యోతి ప్రజల్వన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బైరి ప్రభాకర్ మాట్లాడుతూ క్రీడలతో విద్యార్థులు శారీరక దృఢత్వంతో పాటు మానసికంగా అభివృద్ధి చెందుతారన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి ఇంటర్ పాలిటెక్నిక్ కళాశాల స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌లో గెలుపొందిన క్రీడాకారులను అభినందించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అధ్యాపకులు ఎం.విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరం

కాశిబుగ్గ : అగ్ని ప్రమాదాలపై ప్రజలు ఎలప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఫైర్ స్టేషన్ అధికారి రవీందర్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని ఫైర్ సిబ్బంది ఓ సిటీలోని క్లాసిక్ అపార్ట్‌మెంట్‌లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపార్ట్‌మెంట్లలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్, గ్యాస్ ప్రమాదాలు సంభవించినప్పుడు అధైర్యపడకుండా వెంటనే ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. వేసవిలో ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉందని జాగ్రత్తలు వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది మాధవరెడ్డి, గంగాధర్, రాజేందర్, హరిబాబు, యాదగిరి పాల్గొన్నారు.


ప్రదర్శన ద్వారా వివరిస్తున్న ఫైర్ సిబ్బంది

సఖి సేవలను సద్వినియోగం చేసుకోవాలి

కాజీపేట అర్బన్ : ఆపదలో ఉన్న మహిళలు సఖి వన్‌స్టాప్ సెంటర్ అందజేసే ఉచిత సేవలను సద్వినియోగం చేసుకోవాలని సఖి సెంటర్ లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి, కేస్ వర్కర్ వినీల తెలిపారు. మండలంలోని అయోధ్యపురంలో మంగళవారం మహిళా చట్టాలపై సఖి వన్‌స్టాప్ సెంటర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో వారు పాల్గొని మాట్లాడారు. సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, స్త్రీ,శిశు సంక్షేమ శాఖ సౌజన్యంతో వరకట్న, లైంగిక వేధింపులు, భ్రూణహత్యల నివారణకు, శారీరకంగా, మానసికంగా కుంగిపోయే మహిళలు, బాలికలకు ఉచితంగా సేవలందిస్తామని అన్నారు. ఆపదలో ఉన్న మహిళలు టోల్‌ఫ్రీ నెంబర్181 లేదా 0870–2452112 నంబర్‌లకు సమాచారం అందజేయాలని తెలిపారు. కార్యక్రమంలో అయోధ్యపురం మహిళలు, సఖి సిబ్బంది పాల్గొన్నారు.

కనీస సౌకర్యాలు కల్పించడంలో విఫలం

హసన్‌పర్తి: ఉపాధి కూలీలైన హక్కుదారులకు పనుల వద్ద కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారని డీబీఎఫ్ రాష్ట్రకార్యదర్శి చుంచు రాజేందర్ ఆరోపించారు. మండలంలోని జయగిరి చెరువు వద్ద కూలీలతో మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలో పనిచేసిన కూలీలకు రోజుకు రూ.30 నుంచి రూ.40 వరకు మాత్రమే వస్తున్నాయని తెలిపారు. కేంద్రప్రభుత్వం కొత్త యాప్‌లను తీసుకొచ్చి కూలీల గొంతు నొక్కుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.పనిచేసిన పదిరోజుల్లోనే కూలీలకు డబ్బులు అందించాలని డిమాండ్ చేశారు. ఏడాది పాటు 200 పనిదినాలు కల్పించి రోజుకు రూ.600లు కూలీ అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీబీఎఫ్ నాయకులు చుంచు నరేష్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నాటకపోటీలు వాయిదా

హన్మకొండ కల్చరల్ : వరంగల్ జిల్లా రంగస్థల కళాకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో 2024 మే 14, 15, 16 తేదీల్లో నిర్వహించాల్సిన ఉభయ తెలుగు రాష్ట్రాల నాటకపోటీలను వాయిదా వేస్తున్నామని జిల్లా రంగస్థల కళాకారుల ఐక్యవేదిక అధ్యక్షుడు డాక్టర్ కాజీపేట తిరుమలయ్య తెలిపారు. మంగళవారం వరంగల్‌లోని పోతనవిజ్ఞానపీఠంలో ఐక్యవేదిక అత్యవసర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల కోడ్ ఉన్నందున తాత్కాలికంగా వాయిదా వేయడం జరిగిందని తెలిపారు. తిరిగి జూన్ 9, 10, 11 తేదీల్లో నిర్వహిస్తున్నామని తెలిపారు. దాతలు, పోటీల్లో పాల్గొనేవారు గమనించాల్సిందిగా కోరారు.

చిరుధాన్యాలతో దీర్ఘకాలిక వ్యాధులు దూరం

హసన్‌పర్తి: చిరుధాన్యాల ఆహార అలవాట్ల వల్ల దీర్ఘకాలిక వ్యాధులు దరిచేరవని ప్రముఖ వైద్యుడు పాములపర్తి రామారావు అన్నారు. ఎర్రగట్టు గుట్ట సమీపంలో మంగళవారం చిరుధాన్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ బాల్యం నుంచే చిరుధాన్యాల అలవాట్ల వల్ల పిల్లల్లో మానసిక ఎదుగుదలతో పాటు శారీరక ధృఢత్వం పెంపొందుతుందన్నారు. ఈ సందర్భంగా కరపత్రాన్ని ఆవిష్కరించారు.

సామ్రాట్ అశోక్ జయంతి

హన్మకొండ: హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం తెలంగాణ రాష్ట్ర అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో సామ్రాట్ అశోకుని జయంతిని నిర్వహించారు. ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల అర్జున్ మాట్లాడుతూ నాడు జరిగిన కళింగయుద్ధంలో అమరుల రక్తస్రావాన్ని చూసి చాలా బాధపడి ఇలాంటి యుద్ధం మరోసారి జరుగకుండా ఉండడానికి తనకు ఏకైక మార్గం శాంతియుత జీవనమని గ్రహించి భౌద్ధాన్ని స్వీకరించారని వివరించారు.

రామయ్యకు డాక్టరేట్



కేయూ క్యాంపస్: హనుమకొండకు చెందిన ఉపాధ్యాయుడు కందాల రామయ్యకు హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ సైకాలజీ విభాగంలో డాక్టరేట్ ప్రకటించింది. ములుగు మండలంలోని అబ్బాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. ఓయూలోని సైకాలజీ విభాగం పరిశోధకుడిగా కాకతీయ యూనివర్సిటీ సైకాలజీ విభాగం ఆచార్యులు వి.రాంచంద్రం పర్యవేక్షణలో కాపింగ్ స్టైల్స్ అమాంగ్ హైస్కూల్ టీచర్స్, ది రోల్ ఆఫ్ ఎమోషనల్ ఇంటిలిజెన్స్ ఆక్యూపేషనల్ స్ట్రెస్ అండ్ పర్సనాలిటీ (ఉన్నతపాఠశాల ఉపాధ్యాయుల ఒత్తిడిని అధిగమించే విధానాలపై ఉద్వేగ ప్రజ్ఞ, వృత్తిపరమైన ఒత్తిడి, మూర్తిమత్వం) అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి ఓయూ అధికారులు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు.

నిజాయితీ చాటుకున్న ఆటోడ్రైవర్

కాజీపేట: ఆటోలో బాధితురాలు పోగొట్టుకున్న బంగారునగల పర్సును పోలీసుల చేతుల మీదుగా అందించి నిజాయితీని చాటుకున్న ఆటో డ్రైవర్‌ను ఎస్సై శివకృష్ణ అభినందించారు. కాజీపేట రైల్వే డీజిల్‌షెడ్‌లో టెక్నీషియన్‌గా పని చేస్తున్న రాజేష్‌కుమార్ భార్య సునితతో కలిసి హనుమకొండకు వెళ్లడానికి సోమిడి అడ్డాలో మంగళవారం ఓ ఆటోను ఎక్కారు. నగరంలోని కల్యాణ్ జ్యూలరీ షాపు ఎదుట భార్యభర్తలు ఇద్దరు ఆటోను దిగిపోయారు. కొద్దిసేపటి తర్వాత ఆటోడ్రైవర్ గుట్టపర్తి రాంబాబు లోపలికి చూడగా పర్సు కనిపించడంతో తెరిచి చూశారు. అందులో బంగారునగలు ఉండడంతో వెంటనే ఆటోయూనియన్ నాయకుల ద్వారా సూరితో కలిసి వెళ్లి సీఐ సుధాకర్‌రెడ్డికి వివరించి నగలను అప్పగించారు. నగలను నిజాయితీగా తెచ్చి రైల్వే ఉద్యోగికి అందించిన రాంబాబును పలువురు అభినందించారు.

మోడల్ స్కూల్ ఉపాధ్యాయుడి సస్పెన్షన్

కాశోజీ సెంటర్ : వరంగల్ జిల్లా ఖానాపురం మండలం బుధరావుపేట మోడల్ స్కూల్ ఉపాధ్యాయుడు డి.రాజేందర్‌ను సస్పెండ్ చేస్తూ మోడల్ స్కూల్ అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసాచారి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అదే పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు హారిక ఈనెల 10న ఆత్మహత్యాయత్నం చేసుకుంది. అందుకు రాజేందరే కారణమని డీఈఓ ఇచ్చిన నివేదిక ఆధారంగా సస్పెండ్ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

భద్రకాళి అమ్మవారికి పుష్పార్చన



హన్మకొండ కల్చరల్: భద్రకాళి ఆలయంలో జరుగుతున్న వసంత నవరాత్రోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు మంగళవారం అమ్మవారికి చామంతి పూలతో లక్ష పుష్పార్చన నిర్వహించారు. కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ట్రస్టీ బీవీ పాపారావు దేవాలయాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు.

రోజు విడిచి రోజు నీటి సరఫరా

వరంగల్ అర్బన్: హనుమకొండ నయీంనగర్ బ్రిడ్జి నిర్మాణ పనులు కొనసాగుతున్నందున సమీపంలోని పలు ప్రాంతాల్లో రోజు విడిచి రోజు తాగునీటి సరఫరా జరుగుతుందని బల్దియా ఈఈ రాజయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నయీంనగర్ నాలాపై ఉన్న మంచి నీటి పైపు లైన్‌ను పూర్తిగా తొలగించడం అవసరం ఉందన్నారు. అందువల్ల 5 రోజుల సమయం పడుతుందని పేర్కొన్నారు. గతంలో మాదిరిగా కాకుండా తాత్కాలికంగా హనుమకొండలోని ఇంద్రనగర్, గుడిబండల్, మచిలీబజార్, కాపువాడ, బ్రాహ్మణవాడ, సాయినగర్, పద్మాక్షి వాటర్ ట్యాంక్ పరిధి ప్రాంతాలు రాయపురం లష్కర్‌బజార్ ప్రాంతాలకు రెండు రోజులకోసారి నీటి సరఫరా ఉంటుందని తెలిపారు. బ్రిడ్జి వద్ద పైప్‌లైన్లు అమర్చిన వెంటనే యథావిధిగా రోజువారీగా నీటి సరఫరా జరుగుతుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

శిక్షణ తరగతులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని సెంటర్ ఫర్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచింగ్ (సెల్ట్) ఆధ్వర్యంలో స్పోకెన్ ఇంగ్లీష్ కమ్యూనికేషన్ స్కిల్స్‌పై జూన్ 1 నుంచి 40 రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు సెల్ట్ డైరెక్టర్ డాక్టర్ మేఘనా రావు మంగళవారం తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు, గృహిణులు, నిరుద్యోగులు నాన్ టీచింగ్ ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చునని తెలిపారు. శిక్షణ తరగతులకు ఫీజు యూనివర్సిటీ విద్యార్థులకు రూ 1000, ఇతరులకు రూ.1,500 ఉంటుందని తెలిపారు. మే 20వ వరకు నమోదు చేసుకున్న వారికి జూన్ 1 నుంచి తరగతులు జరుగుతాయని తెలిపారు. వివరాలకు డబ్ల్యూ,డబ్ల్యూ,డబ్ల్యూ.కాకతీయ.ఏసీ.ఇన్‌లో చూడొచ్చని తెలిపారు.

మోసం చేయడంలో కేసీఆర్‌ను మించిన రేవంత్

హన్మకొండ: మాదిగలను మోసం చేయడంలో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌ను సీఎం రేవంత్‌రెడ్డి మించిపోయారని మహాజన సోషలిస్టు పార్టీ జాతీయ నాయకుడు మంద కుమార్ మాదిగ పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి జెడ్పీటీసీ నుంచి ఎంపీ అయ్యే వరకు మాదిగలు అండగా నిలిచారని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. మాదిగల వ్యతిరేకి అయిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో కలిసి మాదిగలను అణచివేస్తున్నాడని ఆరోపించారు. వరంగల్, నాగర్‌కర్నూలు లోక్‌సభ స్థానాల్లో, కంటోన్మెంట్ ఉపఎన్నికల్లో మాదిగలకు అవకాశం కలిపించాలని డిమాండ్ చేశారు.

తామరపూల అలంకరణలో పద్మాక్షి అమ్మవారు

హన్మకొండ అర్బన్: పుష్పయాగంలో భాగంగా మంగళవారం పద్మాక్షి అమ్మవారిని అష్టోత్తర త్రిశతి (308) తామర పూలతో అలంకరించినట్లు ఆలయ వేదపండితులు అర్చకులు నాగిళ్ల శంకర్ శర్మ, నాగిళ్ళ షణ్ముఖ పద్మనాభ అవధాని తెలిపారు. బుధవారం శ్రీరామ నవమి సందర్భంగా సీతారాముల కల్యాణంతో అమ్మవారికి నవరాత్ర పుష్పయాగం కార్యక్రమంతో పరిసమాప్తం కానున్నట్లు పేర్కొన్నారు.

గోవిందరాజుల తిరుకల్యాణోత్సవం ప్రారంభం

వరంగల్ చౌరస్తా : గోవిందరాజుల తిరుకల్యాణ ఉత్సవాల సందర్భంగా మంగళవారం ఎదురుకోళ్ల వేడుకలు వరంగల్‌లో ఘనంగా జరిగాయి. స్థానిక కార్పొరేటర్ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రారంభమై బట్టలబజార్ వద్ద గరిమిళ్ల వీధిలో ఎదుర్కొన్నట్లు తెలిపారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతున్న మహిళ మృతి

ఖిలా వరంగల్ : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఎంజీఎంలో చికిత్స పొందుతున్న ఓ మహిళ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం.. తిమ్మాపురం గ్రామానికి చెందిన కొత్తపెల్లి సుజాత (55) సోమవారం రాత్రి తిమ్మాపురం క్రాస్‌రోడ్డు వద్ద బస్సు దిగి నడుచుకుంటూ ఇంటికి వస్తుండగా అంబాల గ్రామానికి చెందిన బోయిన శివకుమార్ పల్సర్ బైక్‌పై వేగంగా వెళ్తూ ఆమెను బలంగా ఢీకొట్టాడు. దీంతో ఆమె రోడ్డుపై పడిడడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్సై ప్రవీణ్ వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించి క్షతగాత్రురాలిని 108 వాహనంలో ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం ఉదయాన్నే మృతిచెందింది. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బస్సులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

రామన్నపేట : వరంగల్ బస్టాండ్‌లో నర్సంపేట డిపోకు చెందిన బస్సులో మధ్యాహ్నం బస్‌కండక్టర్ ఇచ్చిన ఫిర్యాదుతో ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు ఇంతేజార్‌గంజ్ సీఐ శివకుమార్ తెలిపారు. నర్సంపేట డిపోకు చెందిన బస్సు నిజామాబాద్–నర్సంపేటకు వస్తున్న క్రమంలో మెట్‌పల్లి బస్టాండ్‌లో తనకు ఆరోగ్యం బాగాలేదని ఆంధ్రాకు వెళ్లాలని వరంగల్‌లో దింపమని బస్ ఎక్కించినట్లు కండక్టర్ రాజ్‌కుమార్ తెలిపినట్లు పేర్కొన్నారు. ప్రయాణికుడికి వరంగల్ టికెట్ ఇచ్చి వరంగల్‌కు రాగానే బస్టాండ్‌లో దిగకపోవడంతో బస్సు దిగాలని లేపడంతో ఎటువంటి స్పందన లేదు. దీంతో రాజ్‌కుమార్ బస్టాండ్ కంట్రోలర్ ఆర్.కుమార్‌తో కలిసి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సదరు ప్రయాణికుడిని ఎంజీఎంకు తరలించగా చనిపోయినట్లు గుర్తించారు.

చిట్టీల పేరుతో మోసం.. మహిళ అరెస్ట్



వరంగల్ క్రైం : అనుమతి లేకుండా ప్రైవేట్ చిట్టీలు నిర్వహిస్తున్న నిర్వాహకురాలిని అరెస్ట్ చేసినట్లు సుబేదారి ఇన్‌స్పెక్టర్ పి.సత్యనారాయణరెడ్డి తెలిపారు. నగరానికి చెందిన మోతే కవిత కొంతకాలంగా నిబంధనలకు విరుద్ధంగా చిట్టీలు నిర్వహిస్తోంది. బాధితుడు కొండపెల్లి రవీందర్‌తో రూ.5 లక్షల చిట్టీ వేయించింది. అనంతరం డబ్బులు ఇవ్వకుండా మోసం చేసింది. ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కవితపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు సీఐ పేర్కొన్నారు.


బెల్టుషాపులో మద్యం పట్టివేత

కాజీపేట: పట్టణంలని 63వ డివిజన్ విష్ణుపురిలో ఓ బెల్ట్‌షాపుపై పోలీసులు మంగళవారం రాత్రి దాడి చేసి దాదాపు రూ.14వేల విలువైన మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఎస్సై నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా నూనె రితీష్ ఇంట్లో మద్యం విక్రయిస్తున్నట్లుగా అందిన సమాచారం మేరకు 50 క్వార్టర్ బాటిల్స్, 90 ఎంఎల్ బాటిల్స్ 40 చొప్పున పట్టుకున్నట్లు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. దాడుల్లో ఎస్సైలు శివకృష్ణ, కానిస్టేబుల్స్ చలపతి, విష్ణు, రమేష్‌లు పాల్గొన్నారు.


ఉపాధ్యాయ వృత్తి సమాజంలో ఉన్నతమైనది

పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి

మడికొండ: ఉపాధ్యాయ వృత్తి సమాజంలో ఉన్నతమైనదని పీఆర్‌టీయూ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి అన్నారు. మంగళవారం కాజీపేట మండలం మడికొండ జిల్లా పరిషత్ పాఠశాలలో పనిచేస్తున్న బయోసైన్స్ ఉపాధ్యాయురాలు రోజలీన్ ఉద్యోగవిరమణ సన్మానం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగంలో ఉద్యోగ విరమణ తప్పదని పేర్కొన్నారు. విశ్రాంత జీవితం కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రచార కార్యదర్శి మన్నె చంద్రయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీహరి, కాజీపేట మండల అధ్యక్షుడు మాల కొండారెడ్డి, ప్రధాన కార్యదర్శి వీరయ్య, హెచ్‌ఎంలు సంధ్యారాణి, మల్లారెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షురాలు సమత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

బీజేపీ నాయకుల పరామర్శ



హన్మకొండ: టీఎస్ ఎన్పీడీసీఎల్ మాజీ చైర్మన్, ఎండీ అన్నమనేని గోపాల్‌రావు, హనుమకొండ జిల్లా సీడబ్ల్యూసీ చైర్మన్ అన్నమనేని అనిల్ చందర్‌రావును బీజేపీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేశ్, హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, సీనియర్ నాయకులు గుండె విజయరామారావు, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, గైనేని రాజన్ పరామర్శించారు. ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో గోపాల్‌రావు మనువడు, అనిల్‌చందర్‌రావు కుమారుడు మేఘాంశ్ మృతి చెందాడు. మంగళవారం విద్యుత్‌నగర్‌లోని వారి స్వగృహానికి చేరుకుని వారిని పరామర్శించారు.

ఉప్పల్ రైల్వే యార్డులో మంటలు

కాజీపేట రూరల్ : కాజీపేట సబ్ డివిజన్ పరిధిలోని ఉప్పల్ రైల్వే స్టేషన్‌యార్డులో నిలిపి ఉన్న బొగ్గులోడు గూడ్స్ వ్యాగన్‌లో మంటలు రావడంతో మంగళవారం సమాచారం అందుకున్న కాజీపేట రైల్వే జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీస్ అధికారులు, పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికి వెళ్లి సహాయక చర్యలు చేపట్టారు. కాజీపేట రైల్వేపోలీస్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. రైల్వే యార్డులో వారం క్రితం నిలిపి ఉన్న వ్యాగన్ బొగ్గు లోడులో పొగలు వ్యాపించాయి. చిన్న చిన్నగా పొగలు వ్యాపించి సోమవారం రాత్రి మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న కాజీపేట రైల్వే డీఎస్పీ కృపాకర్, జీఆర్పీ సీఐ రాంమూర్తి, ఆర్పీఎఫ్ సీఐ సంజీవరావు, జీఆర్పీ ఎస్సై మోహినుద్దీన్, ఏఎస్ఐ జావిద్ ఇక్బాల్, జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలానికి వెళ్లి అగ్నిమాపక సిబ్బందితో మంటలు ఆర్పించారు. వేసవి కాలం కావడంతో బొగ్గు లోడుతో వెళ్తున్న గూడ్స్ వ్యాగన్స్‌లలో అధిక ఉష్ణోగ్రత ఉత్పన్నమై సహజసిద్ధంగా పొగలు, మంటలు వస్తాయని అధికారులు చెబుతున్నారు.